ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7 కనిష్ఠం 22.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
ఆదివారం 4 ఆగస్టు 2024

ప్రతీ రైతు కెపాసిటర్ బిగించుకోవాలి : ఏడీఈ

దోమకొండ, ఆగస్టు 3: మండలంలోని ప్రతీ రైతు కెపాసిటర్లను బిగించుకోవాలని ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం దోమకొండ గ్రామ శివారులో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ రైతులు కెపాసిటర్లను బిగించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లో ముట్టవద్దని సమస్య ఉంటే సిబ్బందికి తెలియజేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ ప్రదీప్, సబ్ ఇంజనీర్ నవీన్, ఫోర్‌మెన్ గోపాల్, సీతారాంపూర్ లైన్‌మెన్ మురలీ, హెల్పర్ రాజు, తదితరులున్నారు.





ఎల్ఆర్ఎస్‌కు.. గ్రీన్ సిగ్నల్!

- ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నిర్ణయం
- మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశాలు
- జిల్లాలో 30వేలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
- ప్రభుత్వ ఖజానాకు చేరనున్న ఆదాయం
- దరఖాస్తుదారుల్లో చిగురించిన ఆశలు

కామారెడ్డి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై ఎట్టకేలకు ప్రభుత్వం దృష్టి సారించింది. దరఖాస్తుల పరిశీలనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. మూడు నెలల్లో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వాటిని క్రమబద్ధీకరించాలని ఆయా జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల నుంచే ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేస్తూ మున్సిపల్‌శాఖ రాష్ట్రస్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్లాట్ల దరఖాస్తులను మూడు దశల్లో, లేఅవుట్‌ల దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలించాలని నిబంధనల్లో సూచించారు. వీటిలో అర్హత ఉన్న వాటిని నిర్ధారిత ఫీజుల వసూలు చేసి క్రమబద్ధీకరిస్తారు. స్థలాలు, లేఅవుట్‌లు క్రమబద్ధీకరణకు జిల్లాలో 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై తర్జన భర్జన జరుగుతున్నాయి. తాజా ఉత్తర్వులతో దరఖాస్తుదారుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

30వేలకు పైగా దరఖాస్తులు

అక్రమ లేఅవుట్‌లలో ఖాళీ స్థలాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ప్రారంభించింది. జీవో 131 జారీ చేసి జీవోకు ముందుకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించింది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలతో పాటు 526 గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం దరఖాస్తులు 30,363 వచ్చాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 17,582, బాన్సువాడ మున్సిపల్‌లో 1874, ఎల్లారెడ్డిలో 907, గ్రామ పంచాయతీల పరిధిలో 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో కొన్ని పరిశీలించగా 637 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనకు మార్గదర్శకాలు ప్రభుత్వం జారీ చేయలేదు. ఎల్ఆర్ఎస్‌కు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దరఖాస్తులు తీసుకునే సమయంలో రూ.1000 చొప్పున వసూళ్లు చేయడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూ రింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వివిధ నిబంధనల ఆధారంగా కంప్యూటర్ ద్వారా స్ర్కీనింగ్ చేయనున్నారు. ఆయా ఆస్తుల నిషేధిత జాబితాలో ఉంటే గుర్తించి దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వనున్నారు. దరఖాస్తుదారులు పూర్తిస్థాయి పత్రాలు ఇవ్వకుంటే దానిపైన సమాచారం పంపనుంది. సీజీజీ స్ర్కీనింగ్ అనంతరం మిగిలిన దరఖాస్తులను రెవెన్యూ, నీటి పారుదల, టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. నాలాలు, చెరువులు, వారసత్వ సంపద, శిఖం, దేవాదాయ, ఇనామ్ భూములు తదితర కోణాల్లో పరిశీలించి అభ్యంతరాలు నమోదు చేస్తారు. ఆయా వివరాలను ఇప్పటికే సీజీజీ రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. రెండో దశలో మరింత అధ్యాయనం చేసి అర్హత ఉన్న స్థలాలకు నిర్ధారిత ఫీజు చెల్లించాల్సిందిగా నోటీసులు జారీ చేస్తారు. క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హతమైనవా కాదా అని గుర్తించి ఆ దరఖాస్తులను తిరస్కరిస్తారు. లేఅవుట్‌ల విషయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు పరిశీలన చేయనున్నారు.

దరఖాస్తుదారులకు మంచి అవకాశం

అక్రమ లే అవుట్‌లలో భవన నిర్మాణం కోసం ప్రస్తుత మార్కెట్ అంచనా కోసం 14 శాతం అదనపు పన్నుతో భారీగా పన్ను చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం తీసుకువస్తున్న ఎల్ఆర్ఎస్ అవకాశం లభించడంతో తక్కువ చార్జీలతో అనుమతులతో జారీ చేస్తారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దేవాదాయ, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూములను తప్ప ఇతర లేఅవుట్‌లను క్రమబద్ధీకరించనున్నారు. ఎల్ఆర్ఎస్‌తో దరఖాస్తుదారులకు మేలు చేకూరుతుండగా మరో వైపు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: ప్రతీ ఒక్క ఆవిష్కర్త ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో వాక్‌ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిజాంసాగర్ చౌరస్తా నుంచి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అద్భుతమైన ఆలోచనలతో, స్థానిక సమస్యల పరిష్కారానికి ఆవిష్కరణలు తయారు చేసి ఆ సమస్యకు అడ్డుకట్ట వేసిన ప్రతీ ఒక్క ఆవిష్కర్తను దరఖాస్తు చేసుకునేందుకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సవాళ్లను పరిష్కరించే అత్యంత ఆశాజనకమైన పరిష్కారాలు ఆగస్టు 15, 2024న అవార్డులతో గుర్తించబడుతాయని తెలిపారు. ఈ సంవత్సరం మరిన్ని ఔత్సాహిక ఆవిష్కర్తలకు సమగ్ర మద్దతు అందించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, తహసీల్దార్ జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీడబ్ల్యువో బావయ్య, డీఎస్‌వో సిద్ధిరాంరెడ్డి, ఈడీఎం ప్రవీణ్, టీసీఐఎస్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ గగన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేయాలి

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ప్రతీ మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి కావాలని తెలిపారు. ప్రతీ మహిళ సంఘ సభ్యురాలు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, వెటర్నరి డాక్టర్ డీపీఎంలు రవీందర్‌రావు, సుధాకర్, రమేష్‌బాబు, వకుల తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్‌లకు సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లును 2024పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీసీఎల్ఏ.తెలంగాణ.జీవోవి.ఇన్ ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైన సరే తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపాలని అన్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్‌లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికబద్ధంగా పరిష్కారించాలని, సీసీఎల్ఏ కమిషనర్ సూచనల మేరకు 10 రోజులుగా పెండింగ్‌లను పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రంగనాథచారి, రాథోడ్ రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌పై.. నిర్లక్ష్యం!



నిజాంసాగర్ ప్రాజెక్టు


- నిజాంసాగర్ నుంచి మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు రహదారి అధ్వానం
- ప్రముఖుల రాకపోకలు జరిగినా ఫలితం శూన్యం
- ఇరువైపులా రోడ్డును ముంచేస్తున్న ముళ్ల చెట్లు
- రహదారిపై ప్రయాణం నరకమే
- ఇది నిజాంసాగర్ ప్రాజెక్టు రహదారి దుస్థితి

నిజాంసాగర్, ఆగస్టు 3: ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా నిజాంసాగర్ రూపురేఖలు మారడం లేదు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో పాటు రహదారుల నిర్మాణం చేసినా నైజాం నవాబుల కల సాకారం కావడం లేదు. ప్రాజెక్టు అందాలు, ప్రాజెక్టు కట్టడాలు ఆనాడు ఎంతో చూడముచ్చటగా ఉన్నా ప్రస్తుత పాలకులు నిజాంసాగర్ అందాలపై నిర్లక్ష్య వైఖరి అవలంభించడంతో ప్రాచీన కట్టడాలు, గార్డెన్లు, రహదారులు అధ్వానంగా మారి చూపరులు, ప్రయాణికులకు ఇబ్బం దులు



వీఐపీ రహదారి ఇదే..

కలిగిస్తూనే ఉన్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు 1932లో నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కనువిందు చేసే అతిథి గృహాలతో పాటు గుల్‌గస్త్ గార్డెన్, వీఐపీ అతిథి గృహాలను ఏర్పాటు చేశారు. ఎత్తైన కొండపై నిర్మించిన గోల్‌బంగ్లా చూపరులకు నిరాశనే మిగిలిస్తోంది. మండల కేంద్రం నుంచి పొరుగు జిల్లాకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ఈ రహదారి గుండా వీఐపీ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా ఈ రహదారి గుండానే వెళుతుంటారు. నాగమడుగు, గోల్‌బంగ్లా మలుపుల్లో సైడ్ బొరములు కోతకు గురై ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గోల్‌బంగ్లా నుంచి సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి వరకు రహదారి చెట్లు, ముళ్ల చెట్లతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 20 వరద గేట్ల నుంచి మాసాన్‌పల్లి గేటు వరకు రైతులు సైడ్ బొరములను సాగు కాల్వలుగా మార్చి వేశారు. ఈ రహదారి గుండా వెళ్లాలంటే అనేక పాట్లు పడుతునే ఉన్నారు. నిజాంసాగర్ గుల్‌గస్త్ గార్డెన్ నిర్వహణ లేకపోవడంతో కళాహీనంగా మారింది. వీఐపీ అతిథి గృహం వద్ద ఉన్న గార్డెన్ కూడా అధ్వానంగా మారింది. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉన్న చెట్లు ఎండి పోయాయి. గోల్‌బంగ్లా పర్యాటకులకు కనువిందు చేసే విధంగా ఉన్నప్పటికీ ఈ బంగ్లాను అధికార యంత్రాంగం నిర్వహణ చేయలేకపోవడంతో నీటి పారుదల శాఖ నిర్వహణ కొరవడటంతో పేకాటరాయుళ్లు, పోకిరివాళ్లకు అడ్డాగా మారింది. గుల్‌గస్త్ బంగ్లాను అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిజాంసాగర్ పర్యటనకు వస్తారని లక్షల రూపాయలు వెచ్చించి కనువిందు చేసేందుకు ఆదరా బాదరగా మరమ్మతులు చేశారు. కాగా మూన్నాళ్లకే అవి పాడై పోయాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి పురాతన బస్టాండ్ వరకు తారు రోడ్డు ఏళ్ల క్రితం నుంచి ఉన్నా బీటీ రోడ్డుగా మార్చాలనే ఆలోచన అధికారులకు లేకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం స్పందించి నిజాంసాగర్ అందాలతో పాటు రహదారులను మెరుగుపర్చాలని ఉభయ జిల్లాల పర్యాటకులు, వాహనదారులు కోరుతున్నారు.




రహదారిని ముంచేస్తున్న చెట్లు

మత్తు పదార్థాలు, పేకాటను ఉక్కుపాదంతో అణిచి వేయాలి

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: మత్తు పదార్థాలు, పేకాటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణిచివేయాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నెలవారి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్‌క్రైమ్ నేరస్తులను పీటీ వారెంట్ ద్వారా కోర్టులో ప్రవేశపెట్టి సైబర్ బాధితులకు బాసటగా నిలవాలని సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండాలని, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని అనే విషయాలపై తగు సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఆక్సిడెంట్ ఏరియాగా గుర్తించి, సైన్‌బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. తరచూ వెహికల్ చెకింగ్ నిర్వహిస్తూ డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలి. ముఖ్యంగా ఫేక్ నెంబర్ ప్లేట్స్, నెంబర్ ప్లేట్స్ మార్పుపై ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని సూచించారు. నేర నియంత్రణతో పాటు, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, స్వచ్ఛందంగా వారి గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలిసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్‌లైన్‌లో, మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జార్జ్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ మురళి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

బదిలీపై వెళ్లిన ఫార్మాసిస్ట్‌కు సన్మానం

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వహించిన సంగమేశ్వర్ బదిలీ అయ్యారు. దీంతో మండల కేంద్రానికి చెందిన పీఎంపీ వైద్యులు, మెడికల్ అసోషి యే షన్ ప్రతినిధులు సంగమేశ్వర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఫార్మాసిస్ట్ సంగమేశ్వర్ మాట్లాడుతూ 12 సంవత్సరాలు మండలంలో ఆరోగ్యసేవలు అందించేందుకు సహకరించిన ప్రతిఒక్కరో కృతజ్ఞతలు తెలిపారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : పెద్ద కొడప్‌గల్ గ్రామ శివారులో సాగవుతున్న పత్తి, సోయా పంటలను శనివారం మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాలలో పంట ముంపునకు గురైన సమయంలో త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళ నివారణకు 3 గ్రాములు కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండ జిమ్ ప్లస్ మ్యాంకో జెట్ శిలింద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. ఇంకా ఏవైనా సలహాలు కావాలంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

'ఉపాధ్యాయుల సమస్యలు తీర్చేందుకు కృషి'

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు తీర్చే ఏకైక సంఘం పిఆర్‌టియూ మాత్రమే అని జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి కుషాల్ తెలిపారు. శనివారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్‌టీయూ నూతన ఎన్నిక కార్యవర్గానికి ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కుషాల్ మాట్లాడుతూ 10 సంవత్సరాల కాలంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని తెలు సుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయపరమైన సమస్యలు ఎదు రైనా వాటిని అధిగమించి ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు చేపట్టారని తెలిపారు. దీంతో తాము సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. దీంతో పాటుగానే పాఠశాలల్లో సమస్యల గురించి తమ సంఘ పెద్దలు సీఎం రేవంత్ దృష్టికి తీసుకురాగా త్వరలో పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి

● ఏడేళ్లలో పలువురు మృత్యువాత
● 20 మందికి పైగా క్షతగాత్రులు


వాహనం అదుపు తప్పి బురద గుంతలో పడిన ద్విచక్రవాహనదారుడు

వర్ని, ఆగస్టు 3 : రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా అభివృద్ధిలో ఆదరణ సాధ్యం కావడం లేదు. వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రం వరకు గల రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారి అభివృద్ధి కోసం గత ప్రభుత్వం సుమారు రూ.కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నాలుగు మండలాలకు మహారాష్ట్ర ప్రజలకు సౌకర్యంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రోడ్డంతా బీటీ ఛిద్రమైంది. కిలోమీటర్ల పొడవున బురదమయంగా మారింది. దీంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. గడిచిన ఏడేళ్లలో ద్విచక్రవాహనాలపై నుంచి పడి నలుగురు మృతిచెందారు. ఆటో, ట్రాక్టర్లు బోల్తాపడి 20 మందికి పైగా కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలయ్యారు. తరుచూ ప్రమాదాలు జరిగినా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం స్పందించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులు మృతులు, క్షతగాత్రులను పరామర్శించి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డు అభివృద్ధిపై పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు, ప్రభుత్వ పాలకులు వర్ని-కోటగిరి రోడ్డు అభివృద్ధి కోసం చర్యలు చేపట్టి తమ ప్రాణాలు కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : ఇటీవల సైబర్ నేరగాళ్లు అనేక విధాలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వస్తున్న ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్‌ను ప్రజలు నమ్మవద్దని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల బోధన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల ప్రజలకు ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్‌లో వాట్సప్ డీపీలో సైబర్ నేరగాళ్లు ఢిల్లీ పోలీసులమంటూ ఓ నకిలీ పోలీసు ఫోటో పెట్టి తమ పిల్లల పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ప్రజలకు వస్తున్న ఇటువంటి కాల్స్‌పై పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. సైబర్ క్రైమ్ విభాగం ఈ కాల్స్ పట్ల చర్యలు చేపడుతుందన్నారు. ఈ కాల్స్ ఎక్కడి వస్తున్నాయి. ఎవరెవరు మాట్లాడుతున్నారు తదితర అంశాలను సైబర్ క్రైమ్ అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. కావున ప్రజలు ఇటువంటి కాల్స్‌కు భయపడవద్దని కాల్‌ను బ్లాక్ చేయాలని ఆయన అన్నారు. వారికి భయపడి డబ్బులు వేయడం కాని డబ్బులు వేయడం కాని ఇతరత్రా పనులు చేయకూడదన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాల వితరణ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 3 : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు శనివారం పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ చేశారు. 1998-99 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీసీ కెమెరాలు వితరణ చేశారు.

కారంపొడితో విద్యార్థులకు భోజనం

కోటగిరి, ఆగస్టు 3 : మధ్యాహ్నభోజనంలో విద్యార్థులకు కారంపొడితో భోజనం చేయాల్సి రావడంపై తల్లిదండ్రులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కారంపొడితో భోజనం పెట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో కూర రుచిగా లేకపోవడంతో విద్యార్థులు కారంపొడి వేసుకుని భోజనం చేసే ప్రయత్నం చేశారు. కొంతమంది కారంతో భోజనం చేయలేక అన్నం పడేశారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసింది. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. ఎంఈవోకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంఈవో నాగనాథ్‌ను వివరణ కోరగా కూర సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు కారంపొడి వేసుకుని భోజనం చేశారన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

● రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి


మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

పెర్కిట్, ఆగస్టు 3 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. చిట్ల ప్రమిల జీవన్‌రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విద్యాస్ఫూర్తి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఉన్నతవిలువలతో కూడిన చదువును అందించేలా ప్రోత్సహించాలని, విద్యార్థులు మొబైల్ వినియోగంతో చాలా వరకు మంచిని గ్రహించవచ్చని కానీ కొందరు మొబైల్‌ను దుర్వినియోగపరుస్తున్నారని తల్లిదండ్రులు ఆ విధంగా జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా విద్యార్థులు ప్రతీక్షణం పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థిని విద్యార్థులను వారి గురించి మాట్లాడమని అడిగి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి అయిన పార్థసారథి గత 17ఏళ్లుగా వారి తల్లిదండ్రుల పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజాగంగారాం, వివిధ శాఖల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయండి


కమ్మర్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న పీడీడీఆర్డీవో

కమ్మర్‌పల్లి, ఆగస్టు 3 : స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అన్నిశాఖ అధికారులుసమన్వంతో వందశాతం విజయవతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి (పీడీడీఆర్డీవో) మండల ప్రత్యేక అధికారి సాయగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, ఎంఈవో ఆంద్రయ్య, ఎంపీవో సదాశివ్, ఏపీఎం కుంట గంగారెడ్డి, ఏఈవో అబ్దుల్ మలిక్, వేటర్నరి డాక్టర్ రాజేశ్వర్‌రావు వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఈ నెల 8 నుంచి 9 వరకు రెండు రోజుల పాటు నిర్వహించబోయే స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని బోధన్ మండల ప్రత్యేక అధికారి, డీపీవో తరుణ్ కుమార్ అన్నారు. శనివారం బోధన్ మండల పరిషత్ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామస్థాయి కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

జక్రాన్‌పల్లి: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

రుద్రూరు: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం కావడానికి మండలం లోని అధికారులు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి నిర్మల పేర్కొన్నారు. శనివారం రుద్రూరు మండలపరిషత్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వ హించారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం- పచ్చదానం కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని గ్రామాల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. కార్యక్రమంలో గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ఎంపీడీవో తిరుమల, ఏవో లావణ్య, ఎంపీవో శ్రీధర్, ఏపీవో శకుంతల, ఏపీఎం ప్రమీల, ఏఈ స్వరాజ్, సూపరిండెంట్, ఆరోగ్య శాఖ అధికారులు, ఐకెపీ సిబ్బంది పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి రమేష్ స్వచ్ఛదనం.. పచ్చదనంపై గ్రామ పంచాయతీ మహిళ సంఘం, ఉపాధి హామీ, అంగన్‌వాడీ, ఆశా సిబ్బందికి ఆయన సూచనలిచ్చారు.

ఆర్మూర్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదానం కార్యక్రమంపై శనివారం అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మండల ప్రత్యేక అధికారి, డీసీవో శ్రీనివాస్, ఎంపీడీవో సాయిరాంలు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.

'రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు'

ఎడపల్లి, ఆగస్టు 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించిన రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు మేనేజరుతో రుణమాఫీ కాని రైతులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సిద్ద రామేశ్వర్ బ్యాంకుకు వెళ్ళి రైతులతో, బ్యాంకు మేనేజరుతో మాట్లాడి రైతులకు వివరంగా తెలిపి భరోసా కల్పించారు. రైతులు 10 రోజుల పాటు వేచి ఉండాలని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే లబ్దిదారులను నిర్దారించి డబ్బులను రుణ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఇది గమనించి ప్రభుత్వానికి సహకరించాలని ఆయన రైతులను కోరారు.

రుణమాఫీ పొందిన రైతులకు పంట రుణాలు

కోటగిరి, ఆగస్టు 3 : కోటగిరి సహకార సంఘంలో రుణమాఫీ పొందిన రైతులకు శనివారం కొత్త పంట రుణాలను విండో అధ్యక్షులు కూచి శ్రీనివాస్ పంపిణీ చేశారు. కోటగిరి సహకార సంఘంలో తొలి విడత రుణమాఫీలో 59 మంది రైతులకు 19,13,732 రూపాయలు మాఫీ అయింది. రెండో విడతలో 26 మంది రైతులకు 10,75,613 రూపాయలు మాఫీ వచ్చినట్లు విండో అధ్యక్షులు తెలిపారు. తొలివిడతలో రుణమాఫీ పొందిన 26 మంది రైతులకు ఎకరానికి 44వేల రూపాయల చొప్పున 11,84,200రూపాయల పంట రుణాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ శ్రీధర్ బాబు, నాయకులు గాండ్ల శ్రీనివాస్, శ్యామ్, విండో కార్యదర్శి విఠల్, రైతులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో సామూహిక సీమంతాలు

ధర్పల్లి, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. తల్లిపాలు బిడ్డ తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. తల్లిపాలలో ఉన్న పోషక పదార్థాలు బిడ్డ ఆరోగ్యంగా పుట్టడానికి దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశవర్కర్‌లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు3: మండలంలోని వివేక్‌నగర్‌తండా వద్ద 44వ జాతీయరహదారిపై శనివారం బైక్ డివైడర్‌ను ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైనట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. బైక్‌పై గుర్తు తెలియనివ్యక్తి ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తుండగా వివేక్‌నగర్ తండా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొందని ఈ ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తిని 108అంబులెన్స్‌లో ఆర్మూర్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

రెంజల్, ఆగస్టు3 : రుద్రూరు మండల కేంద్రానికి చెందిన బొంబాయి శైలజ (30) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూరు గ్రామానికి చెందిన శైలజ శుక్రవారం ఉదయం కందకుర్తి గ్రామంలో తన భర్త సంజీవ్ వేరే మహిళను పెళ్లి చేసుకుని ఆమెతో ఉన్నాడని తెలిసి కందకుర్తి గ్రామానికి వెళ్లి భర్తను నిలదీసింది. దీంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త సంజీవ్ మందలించడంతో కందకుర్తి గ్రామం నుంచి సాటాపూర్‌కు వచ్చింది. సాటాపూర్‌లో మందు తాగి మృతిచెందిందని ఎస్ఐ తెలిపారు. శనివారం ఉదయం సాటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. మృతురాలి సోదరుడు గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ధర్నా

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 3 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరుపేదలకు ఇళ్లస్థలాలు, కొత్త పింఛన్‌లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని, జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసి జీవన్‌భృతిని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత రైతు కూలీసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోట్ల రాజు, ఎస్.సుధాకర్, సహాయ కార్యదర్శి సయ్యద్, పెద్దులు, బోట్ల గంగారాం, భానుబేగం, అరుణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ పట్టణంలోని కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో చట్టాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య భారతీయ న్యాయసంహిత చట్టం 2023గురించి వివరించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

డొంకేశ్వర్, ఆగస్టు3: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తల బృందం సందర్శించి మొక్కజొన్న, సోయా, వరి, ఆయిల్‌పాం పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటకు బ్యాక్టీరియా కాండం కుళ్లు ఆశించినట్టు నిర్ధారించి దీని నివారణకు 35శాతం క్లోరిన్ కలిగినటువంటి బ్లీచింగ్‌పౌడర్‌ను ఎకరానికి ఐదు కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అక్సిక్లోరైడ్, పోటాష్ పంటకు వేసినట్లయితే బ్యాక్టీరియ తెగులు నివారించవచ్చని రైతులకు సూచించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

● ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత

వేల్పూర్, ఆగస్టు 3 : తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని భీమ్‌గల్ ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. శనివారం వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లులకు, గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ తల్లి పాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, శిశువు ఎదుగుదలకు ఉపకరిస్తాయన్నారు. రోగనిరోధక శక్తి ఉండడంతో పాటు అనారోగ్య సమస్యలుండవన్నారు. బిడ్డ జన్మించిన గంటలోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని ఆ పాలు తప్పనిసరిగా బిడ్డకు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగహంస, సెక్టార్ లీడర్ డి.స్వరూప, అంగన్‌వాడీ టీచర్‌లు మంజుల, సునంద, కె.స్వరూప, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్‌లు, గర్భిణీ, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో శ్రేయస్కరమని ఎసిడిపీవో జ్ఞానేశ్వరి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం మండలం లోని బషీరాబాద్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులకు అవగాహన కార్యక్రమంలో ఆమే పాల్గొన్నారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు మంజుల, అరుణ మాల, పద్మ, ప్రణవ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని వల్లభాపూర్, జల్లాపల్లి గ్రామాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. డబ్బా పాల కన్నా తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉండడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరునెలల వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి, అంగన్‌వాడీ టీచర్ బాలలక్ష్మి తదితరులున్నారు.

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో బోనాల సంబరాలు

డొంకేశ్వర్, ఆగస్టు 3 : డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సరస్వతి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి పాఠశాల నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు బస్టాండ్ మీదుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. పాఠశాల ఆవరణలో పూలతో అందంగా అలంకరించి బోనం కుండాలను అందంగా తయారు చేసి విద్యార్థినిలు బోనాలు ఎత్తుకొని, విద్యార్థుల వివిధ వేషాదారణలతో చేసిన నృత్యాలకు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ గంగారెడ్డి, సదానంద్, సాయికుమార్, సాయిలు, రాజేశ్వర్, మహేష్‌కుమార్, వెంకటరమణచారి, అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 3 : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదన్నారు. మాస్‌లైన్ జిల్లానాయకులు ఎస్.ముత్తెన్న, సబ్‌డివిజన్ నాయకులు శేఖర్, ఠాగూర్, గంగన్న, రాజన్న, నరేందర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ యువకులకు ఏఈఈ కొలువులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు3: గత సంవత్సరం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్‌కు చెందిన యువకులు ఉత్తీర్ణులై కొలువు సాధించారు. మిర్దాపల్లి గ్రామానికి చెందిన ఎం.సింధు పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపిక కాగా, పెర్కిట్‌కు చెందిన కామని అమూల్య, ఆర్మూర్‌కు చెందిన గైని సాగర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలుగా, కోశనం అభినవ్ పీఆర్ ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వీరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు వారిని అభినందించారు.

నవీపేట పంచాయతీరాజ్ ఏఈగా జాబేర్ బాధ్యతల స్వీకరణ

నవీపేట, ఆగస్టు 3 : మండల పంచాయతీ రాజ్ ఏఈగా శనివారం జాబేర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాన్సువాడలో పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. నవీపేట ఏఈగా పనిచేసిన శ్రావణ్‌కుమార్ నిజామాబాద్ రూరల్ మండలానికి బదిలీ అయ్యారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్ రూరల్, ఆగస్టు 3 : సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన శివకుమార్ అనేవ్యక్తి 15 రోజుల క్రితం అదృశ్యం అయినట్లు బోధన్‌రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. శివకుమార్ తన అక్క గ్రామమైన ఎత్తొండ వెళ్లి తిరిగి వస్తానని ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో అతని మేనమామ తుడిమె హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. సీసీపుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరలోనే కుటుంబసభ్యులకు అప్పజెప్తామన్నారు.

చిన్నజీయర్ స్వామిని కలిసిన మైనారిటీ రాష్ట్ర నాయకులు

బోధన్‌రూరల్, ఆగస్టు3 : చిన్న జీయర్ స్వామిని శనివారం హైదరాబాద్‌లో బోధన్ బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు రజాక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి వద్దకు వెళ్లి అతని ఆశీర్వాదం తీసుకున్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండేలా చూడాలని వేడుకున్నారు.

పెట్రోల్ బంక్ కోసం స్థల పరిశీలన

బోధన్‌రూరల్,ఆగస్టు3: బోధన్ బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ స్థలంలో హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు శనివారం స్థల పరిశీలన నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. పెట్రోల్ బంక్ కోసం స్థలం అనుకూలంగా ఉందా లేదా అనే నిర్ధారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు తదితరులున్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

వర్ని, ఆగస్టు3: కేరళ వరద బాధితుల కోసం సీపీఎం వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు దేశంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించి కేరళ ప్రజలకు అండగా నిలవాలనే సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు వర్ని మండలంలో విరాళాలు సేకరించామని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు.

రుద్రూరు : కేరళ వరద బాధితుల కోసం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నామని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ పేర్కొన్నారు. శనివారం రుద్రూర్ మండలంలోని పలు ప్రాంతాలలో తిరుగుతూ ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించామని తెలిపారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన

ఏర్గట్ల, ఆగస్టు 3: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నాగలక్ష్మీ తెలిపారు. ఆగస్టునెలలో వారం రోజుల పాటు తల్లిపాల విశిష్టతను వివరిస్తూ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు, చిన్నారులు, గర్భిణీలు పాల్గొన్నారు.

'బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి'

ఎడపల్లి, ఆగస్టు 3 : మండలంలోని జానకంపేట గ్రామంలో గల ఆర్టీసీ బస్టాండులో కనీససౌకర్యాలు కల్పించాలని, సీసీ రోడ్డు నిర్మించాలని జానకంపేట సహకార సంఘం చైర్మన్ మిద్దె నరేందర్ అన్నారు. గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్టాండును శనివారం ఆయన గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు ఏర్పాటుకు 1988 సంవత్సరంలో గ్రామస్థులంతా కలిసి 3 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చామన్నారు. కొన్నేళ్ళపాటు సజావుగా బస్సులు లోనికి వెళ్లాయని, ఆ తరువాత బస్సులు లోనికి వెళ్లకపోవడంతో అధికారులకు విన్నవించారు. మూత్రశాలలు, తాగునీరు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బొమ్మడి రాములు(43)అనే వ్యక్తి శనివారం ప్రమాదవశాత్తు పంట పొలం పక్కనే ఉన్న నీటి కుంటలో పడి మృతిచెందినట్లు రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు తన పొలంలో పనుల నిమిత్తం వెళ్తుండేవాడని, శనివారం పనులు ముగించుకుని అక్కడే ఉన్న కుంటలో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోగా ఈత రాక కుంటలోనే మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ముప్కాల్, ఆగస్టు 3 : ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బొట్ల రవి ఇటీవల మృతిచెందగా శనివారం ముప్కాల్ తాజా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మకిషన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. అలాగే దొమకోండ బాలయ్య మృతిచెందగా మృతుని కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబసభ్యులు నాయకుడు పద్మకిషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆజాంగంజ్‌లో లారీలను తొలగించాలని వినతి

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ పట్టణంలోని ఆజాంగంజ్‌లో రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్న లారీలపై చర్యలు తీసుకోవాలని, వాటిని రోడ్డుప్రాంతం గుండా లారీలు నిల్వకుండా తొలగించాలని శనివారం కాలనీవాసులు బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ భారత ఆహార సంస్థ గోదాములకు వెళ్లే లారీలు రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారని, దీని వల్ల కాలనీవాసులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి, కాలినడక ప్రయాణం చేయడానికి కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా నిలిపి ఉన్న లారీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇరువైపులా నిలుపుతున్న లారీలను తొలగించాలని కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


హనుమాన్ చాలీసా పఠనం చేస్తున్న దృశ్యం

సామూహిక హనుమాన్ చాలీసా

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: హిందు వాహిని ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, మహా హారతి కార్యక్రమంను శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మశాలలో నిర్వహించారు. ప్రతీ శనివారం ఉదయం 8 గంటలకు ఆ కార్యక్రమం నిర్వహించబడుతుందని హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని హిందు వాహిని జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, చాలీసా ప్రముఖ్ జగదీష్, సుదర్శన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు

నసురుల్లాబాద్, ఆగస్టు 3: నసురుల్లాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి మాట్లాడుతూ తల్లులకు ముర్రుపాలు, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు, ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం తదితర విషయాల గురించి పూర్తి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి దయానంద్, ఎంపీవో సూర్యకాంత్, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు హాజరయ్యారు.

ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

బీర్కూర్, ఆగస్టు 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. నసురుల్లాబాద్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు సమావేశానికి హాజరయ్యారు. నవంబరులో జరిగే ఎన్ఏఎస్ పరీక్షకు 6, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను సన్నద్ధులను చేయుటకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పాఠశాలలో వ్యూహాలను అమలు చేయాలని విషయ నిపుణులు శ్రీనివాస్, రామాంజనేయులు, గంగాధర్, జయంతిలు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శివరాం, మూడు మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ చైతన్య సదస్సు ఏర్పాటు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: జిల్లా న్యాయసేవా అధికారసంస్థ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ నాగరాణి హాజరై మాట్లాడుతూ లోక్‌అదాలత్ పనితీరును, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సేవలను, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.ఉదయని, శ్రావణి, అధ్యాపక బృందం న్యాయసేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


డీఎల్‌పీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, నాయకులు

వేతనాలను చెల్లించాలని కార్మికుల వినతి

బిచ్కుంద, ఆగస్టు 3: పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇచ్చి నెలనెల క్రమం తప్పకుండా వేతనాలు అందివాలంటూ పంచాయతీ కార్మికులు డీఎల్‌పీవోకు వినతి పత్రం అందించారు. పంచాయతీ కార్మికులు అందరికీ యూనిఫామ్స్ అందించాలని, మురికి పారిశుధ్యం తొలగించే కార్మికులు అనారోగ్యభారిన పడితే ఆసుపత్రి ఖర్చులు ఇవ్వాలని, న్యాయమైన కోరికలపై ఉన్నత అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు ఆర్వో మినరల్ ప్లాంట్ అందజేత

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలకు 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా బుద్దులు నేర్పిన పాఠశాల దేవాలయంతో సమానమని ప్రస్తుతం తమందరం ఏదో ఒక స్థాయిలో స్థిరపడ్డామని తెలిపారు. తమకంటూ మంచి నడవడిక, క్రమశిక్షణ నేర్పేందుకు దేవాలయం లాంటి వేదికైన పాఠశాలకు ఏదో ఒక సహాయం చేయాలని ఆలోచనతో పూర్వ విద్యార్థులందరం కలిసి రూ.65వేల ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పాఠశాల ఇన్‌చార్జ్ జోసఫ్ కిషోర్‌చే ప్రారంభింప చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజుపాటిల్, రమేష్, మోహన్‌బాబు, సుదర్శన్, విఘ్నేశ్వర్, అరుణ, లక్ష్మీ, తిరుపతమ్మ, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

మద్నూర్, ఆగస్టు 3: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం కావడానికి ఉమ్మడి మండలంలోని అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో రాణి అన్నారు. శనివారం ఉమ్మడి మద్నూర్ మండల అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఉమ్మడి మండలంలో విజయవంతంగా అమలుపరచాలని అధికారులకు సూచించారు. ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన రోజు వారి కార్యక్రమాలు, వివరాలను ఆమె వెల్లడించారు. ప్రతిరోజూ గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ర్యాలీలు నిర్వహించాలని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, నీటి పరీక్షలు నిర్వహించాలని, మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, తహసీల్దార్ ముజీబ్, రేణుక, ఏపీవో పద్మ, డోంగ్లి పీహెచ్‌సీ వైద్యులు బస్వరాజు, ఎంపీవో లక్ష్మీ, నర్సయ్య, సూపర్‌వైజర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఐకేపీ సీసీలకు ఎంపీడీవో భారతి ఆదేశించారు. శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయితీల్లో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, తహసీల్దార్ లత, సూపరింటెండెంట్ భానుప్రకాష్, ఎంపీవో మహబూబ్, ఏపీవో అక్మల్ పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామసంఘం అధ్యక్షులకు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని మొదటిరోజు గ్రామంలో ఉన్న యూత్ సభ్యులు, డ్వాక్రా మహిళలు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఎంఈవో యోసప్, శ్రీధర్‌రెడ్డి, సురేష్, సూపర్‌వైజర్ పద్మ, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి అపర్ణ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రతీ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజలకు అవగాహన చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీవో రఘురాం తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. చుట్టుపక్కల శుభ్రపరచడంతో పాటు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం, ఉపాధి హామీ ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై మండల స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మీ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో 5వ తేదీ నుంచి 9 వరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు మండలంలోని గ్రామాల్లో నిర్వహణపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు బాలక్రిష్టా తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో అధికారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగంపేట: మండలంలో ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనంపై మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో నరేష్ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, గ్రామాల్లోని యువకుల ద్వారా నిర్వహించాలని ఆయన తెలియజేశారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కార్యక్రమంపై ఎంపీడీవో లక్ష్మీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఏ, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వీవోలు పాల్గొన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్



బీర్కూర్‌లో మాట్లాడుతున్న ఎంపీవో


దోమకొండలో..

జిల్లాలో 9 కొత్త పంచాయతీల ఏర్పాటుకు గెజిట్ విడుదల

రాష్ట్ర జడ్పీటీసీ ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 3: జిల్లాలో 9 కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసినట్లు రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం నాగిరెడ్డిపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 225 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ వెలువడిందని ఆయన తెలిపారు. దీనిలో భాగంగానే కామారెడ్డి జిల్లాలో 9 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని చిన్న ఆత్మకూర్, కన్నారెడ్డి, గాంధారి మండలంలో పిస్కిల్‌గుట్ట తండా, నసురుల్లాబాద్ మండలంలో పక్కీర నాయక్‌తండా, సంగెం(ఎ), మాచారెడ్డి మండలంలో సోమర్‌పేట్ తండా, గుంటి తండా, ఒడ్డెర గూడెం తండా, భిక్కనూర్ మండలంలో సాంబాపూర్ గ్రామాలు కొత్తగా గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిందని ఆయన తెలిపారు. జిల్లాలో ఇది వరకు 526 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 9 కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 535 కానుందని ఆయన తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మాచారెడ్డి, ఆగస్టు 3: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ నాయకుడు పొన్నాల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పాల్వంచ మండల కేంద్రంలోని పాల్వంచ మర్రి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు పోసు అనిల్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ రాబోయే సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నిలబడి గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహాచారి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాలరాజ్, మాజీ కార్యవర్గ సభ్యులు మదన్, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు

ఎల్లారెడ్డి, ఆగస్టు 3:ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై రామాలయం వద్ద నుంచి ఫైర్ స్టేషన్ వరకు ఉన్న మూలమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పోలీసులు సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లకూడదని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ డివైడర్ వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

మొరం రోడ్డు పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, ఆగస్టు 3: పోచారం ప్రాజెక్టు కట్టవద్దకు, గంగమ్మ గుడికి వెళ్లేందుకు వేస్తున్న మొరం రోడ్డు ఏర్పాటు పనులను శనివారం ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రాజెక్టు కట్ట వద్ద గల గంగమ్మ గుడి వద్దకు వెళ్లే దారి పూర్తిగా అధ్వానంగా ఉండటంతో 9.9 లక్షల రూపాయల వ్యయంతో మొరం రోడ్డు మంజూరైనట్లు ఆయన తెలిపారు. రోడ్డు పనులు జరుగుతున్నందున రోడ్డు పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.


ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో మృతుడు రవీందర్‌రెడ్డి

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి(40) భూ తగాదాలతో గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి కుటుంబీకులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్‌రెడ్డికి రావాల్సిన వ్యవసాయ భూమి మృతుడి పెద్దనాన్న సత్యంరెడ్డి పంచి ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య భూ తగాదాలు గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. దాంతో పాటు పలుమార్లు పోలీసుస్టేషన్ వరకు వివాదాలు చేరాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రవీందర్‌రెడ్డి శుక్రవారం రాత్రి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్‌రెడ్డి మృతికి సత్యంరెడ్డి కారణమని అతనిని శిక్షించాలని శనివారం అతని ఇంటి వద్ద రవీందర్‌రెడ్డి శవాన్ని ఉంచి కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. రవీందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ సీఐ రామన్, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ విషయంపై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్న మొత్తాల పొదుపుపై తపాలాశాఖ అవగాహన

దోమకొండ, ఆగస్టు 3: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డాక్ కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమం(డీసీడీపీ) నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తపాలాశాఖ అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం పోస్టాఫీస్ వద్ద సమావేశం నిర్వహించి తపాలాబీమా, సేవింగ్‌ఖాతాలు, బ్యాంకింగ్ సేవలు, ఐపీపీబీ ఆక్సిడెంటల్ ఇన్సూరెన్సు తదితర సేవలపై తెలియజేశారు. కార్యక్రమంలో దోమకొండ పోస్ట్‌మాస్టర్ సంతోష్ కుమార్, బీపీఎం జావిద్, హితీర్ష తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు క్షీరాభిషేకం

బీర్కూర్, ఆగస్టు 3: బరంగేడ్గి గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రధాని, సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బీర్కూర్, ఆగస్టు 3: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన చాకలి దొడ్డి కింది సాయిలు(52) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన దొడ్డి కింది సాయిలు కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. గత 30 ఏళ్ల క్రితం సాయిలుకు వివాహం జరిగింది. కొన్ని రోజుల్లోనే భార్య, భర్తల మధ్య గొడవలు జరిగి విడిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఉండటానికి సొంత ఇల్లు లేదు. తల్లిదండ్రులు మరణించారు. నా అన్నవాళ్లు ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలోని బాజన్ చెరువు వద్దకు వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం చెరువు వైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పంచానామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచార యత్నం

బాన్సువాడ, ఆగస్టు 3: పట్టణ శివారులోని కామాంధుడు తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడుతుండగా అటుగా వెళ్తున్న యువకులు గమనించి నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

మనస్థాపంతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట, ఆగస్టు 3: మండలంలోని శెట్పల్లిలో మనస్తాపంతో వడ్ల శంకరయ్య(56) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మతుడి భార్య 8 సంవత్సరాల క్రితం పాము కాటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపాడు. తన కుమారుని, కూతురు వివాహం చేశాక కుమారుడు అరవింద్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లగా కూతురు అత్తవారింటికి వెళ్లింది. ఇంట్లో శంకరయ్య ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం అరవింద్ హైదరాబాద్ నుంచి వచ్చే వరకు ఇంట్లో ఎలుకల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న తండ్రిని చూసి ఏమైందని అడుగగా ఎలుకల మందు తాగినట్లు చెప్పడంతో వెంటనే అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపాడు. మృతుడి కుమారుడు అరవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో లైన్‌మెన్‌కు విద్యుత్ షాక్

ఎల్లారెడ్డి, ఆగస్టు 3: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో శనివారం ఎర్రమణుకు వచ్చే ప్రాంతంలో కరెంట్ వైర్లు మరమ్మతులు చేస్తుండగా లైన్‌మెన్ లక్ష్మీనారాయణకు విద్యుత్‌షాక్ తగిలినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. అక్కడే ఉన్న సిబ్బంది గమనించి చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతి సఖీ సెంటర్‌లో అప్పగింత

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించిన యువతిని సఖీ సెంటర్‌లో అప్పగించామని రైల్వే ఎస్ఐ తావునాయక్ తెలిపారు. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో నివాసం ఉండే భాగ్యరేఖ అనే యువతి ఇంట్లో ఎవరికి చెప్పకుండా కామారెడ్డికి చేరుకుందని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో ప్రయాణికులు సమాచారం అందించగా ఆమెను ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పిందని దీంతో సఖీ సెంటర్‌కు అప్పగించామని తెలిపారు. సఖీ సెంటర్ నిర్వాహకులు ఆమె వివరాలు సేకరించి ఆమె తల్లి జ్యోతికి సమాచారం అందించారు. భాగ్యరేఖను తల్లికి అప్పగించి ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని ఎస్ఐ తెలిపారు.

'కాలబైరవ స్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి డబ్బులు ఇవ్వొద్దు'

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: ఇసన్నపల్లి-రామారెడ్డిలో గల కాలబైరవ స్వామి క్షేత్ర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రమునకు ప్రస్తుతం ఎవరు విరాళాలు అందించవద్దని వలిపిశెట్టి లక్ష్మీరాజం తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంగునూరి పోచయ్య ఉప్పల హరిధర్ ఈ సత్రంకు నిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చేసిన ఎన్నిక చట్టరీత్యా చెల్లనేరదని తెలిపారు. ఆలయంలో నిత్యాన్నదాన సత్రంపై తాను కోర్టులో కేసు వేయగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. జిల్లా సొసైటీ రిజిస్ట్రార్ రెండు నెలల లోపు చట్టపరంగా అట్టి సత్రం ఎన్నిక జరిపించాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. అయితే శ్రావణ మాసంలో అన్నదానం కోసం రూ.1100లు చెల్లించాలని కోర్టు ద్వారా రద్దు చేయబడిన కమిటీ అధ్యక్షుడు వాట్సాప్ గ్రూప్‌లలో ప్రచారం చేస్తున్నారని కావున వైశ్యులు ఎవరూ కూడా విరాళాలు ఇవ్వవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైన ఇచ్చినచో సత్రమునకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కామారెడ్డి టౌన్, ఆగస్టు 3: కామారెడ్డి జిల్లా గ్రంథాలయానికి కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీఎన్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25వేల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీఎన్‌రావు మాట్లాడుతూ పాఠకులకు అవసరమైన పుస్తకాలను ఫౌండేషన్ ద్వారా గ్రంథాలయాలకు బీసీ, ఎస్‌సీ స్టడీ సర్కిల్ వారికి సైతం పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ఇబ్బందులు కలుగవద్దని తమ ఫౌండేషన్ తరఫున పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బుగ్గారెడ్డి, సిబ్బంది గణపతి, కపిల్, అడ్వకేట్ జగన్నాథం, కౌన్సిలర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
శాంతి - ఓసీ
దర్శన్ - శివంభజే
ప్రియా 70 - కల్కి
ప్రియా 35 - రాయన్, బడ్డి

బాన్సువాడ
మహేశ్వరి - రాయన్
వెంకటేశ్వర - పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

